క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని సీనియర్‌ సిటిజన్‌ కౌన్సిల్‌ 16వ ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. రక్త పరీక్షలు, బీపీ, వెరికోస్‌వీన్స్‌ తదితర వ్యాధులకు సంబంధించి 50 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. చిరంజీవి హాస్పిటల్స్‌ డాక్టర్‌ సంజీవరావు ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. సీనియర్‌ సిటిజన్‌ కౌన్సిల్‌ అధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బారావులు శిబిర నిర్వహణ ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌ పరిధి పీజేఆర్‌ నగర్‌లోని నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ధన్వంతరి జయంతి వేడుకలకు కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ హాజరయ్యారు. ధన్వంతరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి అన్నారు. వ్యాధుల నివారణకు ధన్వంతరి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్యరంగంలో ఆయన చేసిన సేవలు మరువ లేనివని తెలిపారు. కార్యక్రమంలో పోశెట్టి గౌడ్‌, శ్రీనివాస్‌, యాదగిరి, వెంకటేష్‌, సతీష్‌, స్వామి, పోచయ్య, రాజ్‌కుమార్‌, మల్లేష్‌, కృష్ణ, నాగేష్‌, శ్యామ్‌, భాస్కర్‌, దశరథ్‌, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌ పనులు పూర్తి చేయాలి



పైపులైన్‌ జంక్షన్‌ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ సబిహా బేగం

మోతీనగర్‌: పైపులైన్‌ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్‌ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని యూసుఫ్‌ నగర్‌లో శనివారం మంజీర ట్రాన్స్‌మిషన్‌ వాటర్‌ పైపులైన్‌ జంక్షన్‌ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరంగా మంచినీటి సరఫరా అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు.

పాఠశాలలో దీపావళి వేడుకలు



మూసాపేట: మూసాపేట శ్రీహరి నగర్‌లోని కిడ్జీ మౌంట్‌ లిటెరా పాఠశాలలో శనివారం దీపావళి సంబరాలు నిర్వహించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేసి దీపాలు వెలిగించి సంబరాలు జరిపారు. ఉపాధ్యాయులు దీపావళి ప్రాధాన్యతను వివరించారు. పర్యావరణానికి హాని కలుగకుండా పండుగలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ శ్రావణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు శనివారం 1కిలోకి ఈ విధంగా ఉన్నాయి. టమాట రూ.19, వంకాయ రూ.28, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.35, బజ్జి మిర్చి రూ.35, కాకరకాయ రూ.31, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.23, బీన్స్‌ రూ.45, క్యారెట్‌ రూ.47, గోబిపువ్వు రూ.30, దొండకాయ రూ.18, చిక్కుడుకాయ రూ.65, గోరుచిక్కుడు రూ.45, బీట్‌రూట్‌ రూ.40, క్యాప్సికం రూ.55, ఆలుగడ్డ రూ.23, కీరా రూ.23, దోసకాయ రూ.18, సొరకాయ రూ.20, పొట్లకాయ 18, కంద 45, ఉల్లిపొరక 43, ఉల్లిగడ్డ 20, మామిడికాయ 15 నుంచి 20, అరటికాయ 10 నుంచి 11, చామగడ్డ 21, ముల్లంగి 6 నుంచి 8, చిలగడ దుంప 40, గుమ్మడికాయ 50, నిమ్మకాయలు 20 నుంచి 24, మునగకాయలు 8 నుంచి 10, బొప్పాయి 40, పుట్టగొడుగులు 45, ఎండుమిర్చి 160, అల్లం 100, వెల్లుల్లి 160, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 80, కరివేపాకు 80, పల్లికాయ 55, లోబా 40, కాకరకాయ 85 ధరలు ఉన్నాయి.

బీసీ బంద్‌ విజయవంతం

ఉదయం నుంచే ర్యాలీలు
- స్తంభించిన రాకపోకలు
- 42 శాతం రిజర్వేషన్‌ కల్పించాలని డిమాండ్‌
- మద్దతు తెలిపిన అఖిలపక్ష నాయకులు



బంద్‌ సందర్భంగా కూకట్‌పల్లిలో డిపోకే పరిమితమైన బస్సులు



నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి



జేఎన్‌టీయూ ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేస్తున్న బీసీ విద్యార్థి సంఘాల నాయకులు



బాలానగర్‌ వై జంక్షన్‌లో రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు



బీసీ బంద్‌కు మద్దతుగా కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డి, బీఆర్‌ఎస్‌ శ్రేణులు



బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతున్న ఫతేనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సతీష్‌ గౌడ్‌ తదితరులు



ఎల్లమ్మబండలోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు



కూకట్‌పల్లి చౌరస్తాలో సంఘీభావం తెలుపుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్‌



కూకట్‌పల్లిలో పాల్గొన్న కార్పొరేటర్‌ సత్యనారాయణ తదితరులు



జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు



కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నెంబర్‌ 1 గాంధీ విగ్రహం వద్ద మద్దతు తెలుపుతున్న బీసీ జర్నలిస్టులు



అల్లాపూర్‌ డివిజన్‌లో సంఘీభావం తెలుపుతున్న కార్పొరేటర్‌ సబిహా బేగం, గౌసుద్దీన్‌ తదితరులు



ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌లో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్‌, అఖిలపక్ష నాయకులు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): కూకట్‌పల్లి నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో శనివారం బీసీ రిజర్వేషన్‌ సాధన కోసం బీసీ సంఘాలు, వివిధ పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు బంద్‌ విజయవంతంగా ముగిసింది. ఉదయం నుంచే వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలు మూసి ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. బీసీ జర్నలిస్ట్‌ అసోసియేషన్‌ జేఏసీ నాయకులు కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్‌ 1లోని గాంధీ విగ్రహం వద్ద బంద్‌కు సంఘీభావం ప్రకటించారు. ఉదయం నుంచి బీసీ సంఘాల నాయకులు ప్రధాన రహదారుల్లో తిరుగుతూ బంద్‌కు సహకరించాలని పలువురు వ్యాపారులను కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీసీలు కోరుకుంటున్న న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. బంద్‌ విజయవంతంగా ముగిసిందని నాయకులు తెలిపారు.

డిపోలకే పరిమితమైన బస్సులు

మూసాపేట: బీసీ సంఘాల పిలుపు మేరకు బంద్‌ ప్రశాంతంగా జరిగింది. కూకట్‌పల్లి ఆర్టీసీ బస్సులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు డిపోకే పరిమితమయ్యాయి. మధ్యాహ్నం అనంతరం సుమారు 86 బస్సులను నడిచినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్‌ హరి తెలిపారు. కూకట్‌పల్లి పోలీసులు డిపో వద్ద వివిధ సంఘాల నేతలు ధర్నాకు దిగకుండా ముందస్తుగా బందోబస్తు నిర్వహించారు.

చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగింత



చిన్నారులను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

మూసాపేట: తప్పిపోయి పోలీస్‌స్టేషన్‌కు చేరిన చిన్నారులను క్షేమంగా గూగుల్‌ మ్యాప్‌ ద్వారా వారి తల్లిదండ్రులకు కూకట్‌పల్లి పోలీసులు అప్పగించారు. కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌ వద్ద ఒంటరిగా ఉన్న చిన్నారులను స్థానికులు కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో మెట్రో స్టేషన్‌ వద్ద ఇద్దరు చిన్నారులు ఒంటరిగా ఉండటంతో 100కు డయల్‌ చేసి సమాచారం ఇచ్చారు. కూకట్‌పల్లి పోలీసులు చిన్నారులను తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో వారి సంరక్షణలో ఉంచారు. అరవింద్‌(4), జయశ్రీ (4) అని చిన్నారులు తెలిపారు. గూగుల్‌ మ్యాప్‌లో బాబు తమ భవనం గుర్తు పట్టడంతో పోలీసులు తీసుకెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుత్‌ సమస్యలు పరిష్కరించాలి



విద్యుత్‌ అధికారులకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌

మూసాపేట: విద్యుత్‌ సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కార్పొరేటర్‌ మహేందర్‌ అన్నారు. బస్తీ బాటలో భాగంగా మూసాపేటలోని జనతానగర్‌, వడ్డెర బస్తీలో అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. బస్తీలలో విద్యుత్‌ సమస్యలను పరిశీలించారు. కొన్ని చోట్ల ఎలక్ట్రికల్‌ పోల్స్‌ పాతవిగా మారి ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించారు. కొన్ని చోట్ల పోల్స్‌ సరిగ్గా లేని కారణంగా షార్ట్‌ సర్క్యూట్‌లు జరుగుతున్నాయని కార్పొరేటర్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పిట్ల మనోహర్‌, యాదగిరి, ప్రశాంత్‌రెడ్డి, కేదార్‌మానిక్‌, దాసరి అబ్బాస్‌, నవీన్‌, కృష్ణ యాదవ్‌, విద్యుత్‌ అధికారులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

అటకెక్కిన రోడ్డు విస్తరణ!

మార్కింగ్‌ వేశారు.. పనులు మరిచారు

> రోడ్డు విస్తరణతో ఓల్డ్‌ బోయిన్‌పల్లికి మహర్దశ పట్టబోతుందనుకున్న వాహనదారులకు నిరాశ తప్పడం లేదు. ఓల్డ్‌ బోయిన్‌పల్లి ప్రధాన రహదారి ఇరుకుగా ఉండి ఎదురుగా ఒక బస్సు వస్తే మరో బస్సు, ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ప్రజలు, వాహనాదారులు నిత్యం ట్రాఫిక్‌ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు, ప్రజాప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసి చివరగా 60 ఫీట్ల రోడ్డు పనులకు అంగీకరించారు. అనంతరం మార్కింగ్‌ కూడా వేశారు. అయినా పనులు సాగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



REATER HYDERABAD MUNICIPAL CORPORATION

ఇళ్లను కోల్పోతున్న వారికి జీహెచ్‌ఎంసీ అధికారులు అందజేసిన నోటీసు



ఇరుకుగా మారిన ఓల్డ్‌ బోయిన్‌పల్లి ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారిని విస్తరించేందుకు 2018 డిసెంబర్‌లో పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక నాయకులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయం మేరకు రూ.80 ఫీట్ల రహదారిగా విస్తరించాలని భావించారు. అనతరం ప్రజల సూచనాలు, సలహాలు తీసుకుని ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ ఆధ్వర్యంలో 60 ఫీట్లకు కుదించాలని నిర్ణయించిన అధికారులు రోడ్డు విస్తరణలో పోతున్న భవనాలను గుర్తించారు. అందులో 300 భవనాలు గుర్తించి డిమార్కు కూడా వేశారు. అనుకున్నదే తడవుగా అధికారులు 30 మంది ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేశారు.

రోడ్డు విస్తరణకు ప్రణాళికలు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి ప్రధాన రహదారిని ప్రియదర్శిని హోటల్‌ నుంచి ఓల్డ్‌ బోయిన్‌పల్లి చౌరస్తా మీదుగా హస్మత్‌పేట చౌరస్తా, దుబాయిగేట్‌ వరకు ఈ రోడ్డు విస్తరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఓల్డ్‌ బోయిన్‌పల్లి ప్రధాన రహదారి ఎన్‌హెచ్‌ 44కు, సికింద్రాబాద్‌, అల్వాల్‌ నుంచి రాజీవ్‌ రహదారితో పాటు ముంబాయి హైవేకు అనుసంధానంగా ఉండటంతో ప్రజలు కూడా రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరుతున్నారు.

స్టాండింగ్‌ కౌన్సిల్‌లో ఆమోదం పొందినా..

రోడ్డు విస్తరణ కోసం 2022లో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కౌన్సిల్‌లో ఆమోదం తెలిపారు. దీంతో త్వరితగతిన పనులు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందుగా నోటీసులు జారీ చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని నిర్ణయించారు. అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నా పనులు మొదలు కాలేదు. దీంతో ప్రజలు మళ్లీ రోడ్డుకు ఆనుకుని నిర్మాణాలను చెపడుతున్నారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ మరోసారి జోక్యం చేసుకుని రోడ్డు విస్తరణ పనులను ముందుకు తీసుకువెళ్లేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సవాల్‌గా భూముల పరిరక్షణ!

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, అసైన్డ్‌ భూములు

- ఇంటి దొంగలతో ఇక్కట్ల పాలవుతున్న అధికార యంత్రాంగం
- పటిష్ట వ్యవస్థ లేకపోవడంతో యథేచ్ఛగా భూ ఆక్రమణలు
- భూకబ్జాల కట్టడికి అధికారుల పకడ్బందీ చర్యలు

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల పరిరక్షణ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారుతోంది. ధన, అధికార బలమున్న పెద్దలకు కొందరు ఉద్యోగులు తలొగ్గుతుండగా, మరికొందరు అమ్యమ్యాలకు లాలూచి పడి.. భూమార్పిడిలోని లోసుగులను అనుకూలంగా మల్చుకుని తప్పుడు చర్యలకు ఒడిగడుతున్నారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన కొందరు రాజకీయ పెద్దలు వాటిని భక్షించేందుకు పన్నుతున్న కుట్రల్లో పలువురు అధికారులు, ఉద్యోగులు పావులవుతున్నారు. దీంతో భూపరిరక్షణ పెద్ద టాస్క్‌గా తయారైంది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్‌ భూములకు రక్షణగా నిలిచి.. వాటి ఆక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే పటిష్ట వ్యవస్థ లేకపోవడం కూడా భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఇబ్బందికరంగా మారింది. డివిజన్‌ స్థాయిల్లో గతంలో లాగా భూపరిరక్షణకు టాస్క్‌ఫోర్స్‌ టీంలు లేకపోవడంతో కూడా సులవుతోంది. ఈ క్లిష్ట తరుణంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ ధ్యేయంగా సర్వే నిర్వహించిన రెవెన్యూ యంత్రాంగం సాంకేతికంగా కిహోల్‌ మార్కస్‌ లాంగ్వేజ్‌ (కేఎంఎల్‌) మ్యాప్‌ (గూగుల్‌)లో పొందుపర్చడం ద్వారా పటిష్ట చర్యలకు పూనుకుంటోంది.

మండలాల వారీగా భూముల గుర్తింపు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల వివరాలను మరోసారి పరిశీలించి, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. భూముల సంరక్షణ బాధ్యత ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందని పేర్కొంటున్న జిల్లా యంత్రాంగం.. గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీలు, ఫెన్సింగ్‌ వంటి పనులు చేపట్టడంపై దృష్టి సారిస్తోంది.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో..

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ శాఖ ఇందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి.. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. బాలానగర్‌ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది. శామీర్‌పేటలో 420, దుండిగల్‌ గండిమైసమ్మలో 425, మేడిపలిలో 900, ఘట్‌కేసర్‌లో 500, కాప్రాలో 400, కీసరలో 417, కుత్బుల్లాపూర్‌లో 600, బాచుపల్లిలో 360, ఉప్పల్‌లో 333.13, మల్కాజిగిరిలో 113.06, మేడ్చల్‌ మండలాల్లో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్‌ భూములెక్కువనే..

జిల్లాలో 2004 సంవత్సరానికి ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను పంటల సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘటేస్కర్‌ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేటలో 30 గ్రామాల్లో 1451, కీసరలోని 16 గ్రామాల్లో 1500, మేడ్చల్‌లోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్‌లోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286, కుత్బుల్లాపూర్‌లోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్‌ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. ఇందులో చాలావరకు వెంచర్లు, రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్‌ ఇండ్లు, ప్రైవేట్‌ విద్యా సంస్థలు, ఆసుపత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

కోర్టుల్లో కేసులు..

జిల్లాలో భూసంబంధిత కోర్టు కేసులు 706 ఉన్నాయి. ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్‌ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే వివిధ కోర్టుల్లోని కేసుల వివరాలు సుప్రీంకోర్టులో 1, హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్‌ కోర్టులో 6 కేసులు కొనసాగుతున్నాయి. కోర్టు ధిక్కారంలో కూడా పలు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది.

వివాదంలోని భూములివే..

మేడ్చల్‌ జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్‌ కోర్టు పరిధిలో భూములు 2,485 ఎకరాలు కాగా, రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు ఉన్నాయి. ఇతర వివాదాలతోపాటు ఎండోమెంట్‌, వక్ఫ్‌, అటవీ, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు, అసైన్డ్‌ భూముల కేటాయింపుల్లో భాగంగా 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నాయి.

